
సాక్షి బాపట్ల
ఆదివారం । 11 । ఆగస్టు । 2024



జిల్లా ఎస్పీని కలిసిన జేసీ

నగరంపాలెం: జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ శనివారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఇరువురు బాధ్యతలు స్వీకరించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 5527 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 2120 క్యూసెక్కులు విడుదల చేశారు.

బెల్లం ఊట ధ్వంసం



నిజాంపట్నం: పరిశా వారిపాలెం శివారులో 300 లీటర్లు, అదవల గ్రామ శివారు పాలరేవులో 600 లీటర్ల బెల్లం ఊట గుర్తించి ధ్వంసం చేసినట్టు నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ప్రసాద్ తెలిపారు.

భయం గుప్పెట్లో లంక గ్రామాలు

- దిగువకు 2.46లక్షల క్యూసెక్కులు విడుదల
- ఎగువ నుంచి తగ్గని వరద ఉధృతి
- నీటి పరిమాణం మరింత పెరిగే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న అధికారులు



కొల్లూరు మండలం పెదలంక వద్ద వరద నీటి ప్రవాహం

కొల్లూరు: కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో గడుపుతున్నారు. ఎప్పుడు వరద వచ్చి తమ గ్రామాలను ముంచెత్తుతుందోనని కంటి మీద కునుకు లేకుండా కాలం గడుపుతున్నారు. శనివారం కృష్ణా నదిలో వరద ఉధృతి కొంతమేర తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజ్ నుంచి తొలి రోజు మూడు లక్షల క్యూసెక్కుల పైబడి వరద నీటిని దిగువకు విడుదల చేసిన అధికార యంత్రాంగం, ఎగువ నుంచి వస్తున్న నీటి పరిమాణం తక్కువగా ఉండటంతో శుక్రవారం 2.46 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు. దీంతో వరద ఉధృతి తగ్గింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు వరద నీటి విడుదల పెరిగింది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్లు బ్యారేజ్ అధికారులు కిందకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు బ్యారేజ్ నుంచి 2.46 లక్షల క్యూసెక్కులు విడుదల చేయడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 4.43 లక్షల క్యూసెక్కులు, నాగార్జునసాగర్ నుంచి 3.55 లక్షల క్యూసెక్కులు, పులిచింతల నుంచి 3.16 లక్షల క్యూసెక్కుల విడుదలవుతున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజ్ నుంచి సాగరంలోకి శనివారం సాయంత్రానికి 2.76 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. విజయవాడ బ్యారేజ్ నుంచి నీటి విడుదల పరిమాణం అర్ధరాత్రికి పెరిగి సుమారు 3.20 లక్షల క్యూసెక్కుల వరకు విడుదల చేసే అవకాశాలున్నట్లు ఆర్‌సీ అధికారులు చెబుతున్నారు. కృష్ణా నది దిగువకు వరద నీటి విడుదల పరిమాణం క్రమేపీ పెరుగుతున్న క్రమంలో లంక గ్రామాలలో వేలాది ఎకరాలలో వాణిజ్య పంటలు సాగుచేసి రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



కొల్లూరు మండలం గాజుల్లంక చినరేవు వెంబడి వరద నీటిలో నానుతున్న ఇటుక బట్టీలు

అరవింద వారధికి తాడు సాయంతో వేలాడదీసిన విద్యుత్తు మోటరు →



అడ్డుకట్ట పటిష్టానికి చర్యలు



పల్లపు భూముల్లోకి వరద నీరు ప్రవేశించకుండా పటిష్టపరిచిన అడ్డుకట్ట

సముద్రంలోకి నీటి విడుదల పెరుగుతున్న తరుణంలో పెసర్లంక అరవింద వారధి వద్ద గతంలో ఏర్పడిన గండి నుంచి వరద నీరు పల్లపు పంట భూములు, ఇటుక బట్టీల్లోకి ప్రవేశించకుండా ఏర్పాటు చేసిన అడ్డుకట్ట వరద నీటి ఉధృతిని తట్టుకొని నిలబడగలుగుతుందా అనే సందేహం ఆ ప్రాంత రైతుల్లో వ్యక్తమవుతుంది. అడ్డుకట్ట వరద ఉధృతికి కోతకు గురవ్వకుండా ఉండేందుకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించి పటిష్టం చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

న్యూస్‌రీల్

నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

ఫ్యాక్టరీ యాజమాన్యం, గ్రామస్తులతో బాపట్ల జేసీ సుబ్బారావు సమావేశం



మేదరమెట్ల: గ్రామంలోకి కారం కోరు రాకుండా నెల రోజుల్లో తగిన పరిష్కారం చేస్తామని సింథైట్ ఫ్యాక్టరీ నిర్వాహకులు హామీ ఇచ్చారు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండల కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సుబ్బారావు శనివారం గ్రామస్తులు, ఫ్యాక్టరీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నెల రోజుల్లో ఫ్యాక్టరీ నుంచి కారం కోరు బయటకు రాకుండా చూస్తామని ఫ్యాక్టరీ నిర్వాహకులు చెప్పినట్లు జేసీ తెలిపారు. చెప్పిన గడువు తరువాత కోరు వస్తే ఫ్యాక్టరీని మూసి వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఫ్యాక్టరీ నిర్వాహకులు తెలియజేశారన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల తమ్మవరం రోడ్డు సమీపంలో గల సింథైట్ కారం ఫ్యాక్టరీ నుంచి కొన్ని నెలలుగా కారం కోరు వస్తుందని, దీనివలన గ్రామ ప్రజలు పరిసర ప్రాంతాల ప్రజానీకం ఇబ్బందులు పడుతున్న విషయం విదితమే. సమావేశంలో ఆర్‌డీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఫ్యాక్టరీ డీజీఎం మహేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో జాతీయ జెండా ఎగరాలి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



లక్ష్మీపురం: ప్రతి ఇంట్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తితో మెలగాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా 'హర్ ఘర్ తిరంగా 3.0' కార్యక్రమాన్ని మంత్రి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశంలోని ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఉండాలని కోరారని గుర్తుచేశారు. రూ.25కే పోస్టాఫీసులో జెండాను అందుబాటులోకి తెచ్చామన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి మాట్లాడుతూ దేశంలో పుట్టినందుకు అందరం గర్వించాలన్నారు. అనంతరం పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలో అధికారులతో కలిసి పెమ్మసాని మొక్కలు నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ ఏపీ సర్కిల్ జగదీష్, చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఆఫ్ ఏపీ సర్కిల్ డి.ఎస్.వి.ఆర్.మూర్తి, గుంటూరు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ పడి బాలిక మృతి

వల్లాపల్లిలో విషాదఛాయలు



బల్లికురవ: ఇంటిపైన నిర్మించుకున్న వాటర్ ట్యాంక్ నిద్రిస్తున్న బాలికపై పడటంతో మృతి చెందిన ఘటన బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామం ముస్లిం కాలనీకి చెందిన షేక్ నాగులమీరా, సైదాబీ దంపతులకు కుమారుడు జాన్‌వలీ, కుమార్తె ఆఫీయా (12) ఉన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జాన్‌వలీ ఎనిమిదో తరగతి, కుమార్తె ఏడో తరగతి చదువుతున్నారు. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో కుమార్తె ఆఫీయా మధ్యాహ్నం రెండు గంటల వరకూ తోటి పిల్లలతో ఆడుకుని ఇంటికి వచ్చి నిద్రపోయింది. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. ఈ క్రమంలో ఆఫీయా గాఢ నిద్రలో ఉండగా రేకుల షెడ్డుపై ఏర్పాటుచేసుకున్న వాటర్ ట్యాంక్ అకస్మాత్తుగా కిందకు దొర్లింది. వాటర్ ట్యాంక్ రేకుల చివరి అంచున నిర్మించి ఉండడంతో దొర్లుకుంటూ వచ్చి నిద్రిస్తున్న బాలిక తలపై పడింది. బాలిక తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో హుటాహుటిన బాలికను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యం అందక ముందే మృతిచెందింది. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబంలో కుమార్తె మృతితో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్టా శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు చింతల రామకృష్ణ, కొమ్మినేని రాంబాబు తదితరులు ఆఫీయా భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



అంబేద్కర్ స్మృతి వనాన్ని ధ్వంసం చేసినందుకు కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న డాక్టర్ గణేష్

దుండగులను కఠినంగా శిక్షించాలి

- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరి గణేష్
- చెరుకుపల్లిలో కొవ్వొత్తులతో నిరసన

చెరుకుపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం శిలాఫలకాలను ధ్వంసం చేయటం దేశద్రోహమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. చెరుకుపల్లిలోని డాక్టర్ ఈవూరి గణేష్ క్యాంపు కార్యాలయం వద్ద స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, అంబేద్కర్ యూత్ సభ్యులు శనివారం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే గాని అరాచకాలు చేయడానికి కాదన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గౌరవాన్ని ప్రపంచ దేశాలకు చాటే విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రపంచంలోనే అతి పెద్దదైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. దేశంలో కోట్లాది మంది ప్రజలు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ ఫలితంగా రిజర్వేషన్లు అనుభవిస్తూ ఎందరో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా అధికారం పొందిన రాష్ట్ర హోం మంత్రి అనిత మాత్రం ఎక్కడా నోరు మెదపకుండా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనాన్ని ధ్వంసం చేసిన దోషులను ఇప్పటి వరకు పట్టుకోకుండా తాత్సారం చేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంబేద్కర్ విగ్రహ ధ్వంసానికి కారకులైన వారు ఎంతటి వారైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉల్లంగుంట శ్రీరాంమూర్తి, కొత్తపల్లి సుబ్బయ్య, కాశీ ప్రభాకర్, ఎనుముల వెంకటేశ్వరరావు, జాలాది ఇస్సాక్, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్మృతివనంపై పచ్చమూకల దాడి అమానుషం

మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్



రేపల్లె రూరల్: విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనంలోని సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చమూకలు దాడి చేయటం హేయమైన చర్యని రేపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పేలా రూ.400 కోట్ల వ్యయంతో విజయవాడ నడిబొడ్డున స్మృతి వనం పేరుతో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై అక్కసుతో స్మృతివనంపై పచ్చమూకలు దాడి చేయటం బాధాకరమన్నారు. స్మృతి వనంపై దాడులకు పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను గౌరవిస్తూ ఆయన విగ్రహాలపై దాడులు జరగకుండా కఠిన చట్టాలను అమలు చేయాలని కోరారు.



చిన్నారులకు మెమొంటో అందజేస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ జి.నరేందర్

బాలలపై దాడులను అణచివేయాలి

- సమాజ దృక్పథంలోనూ మరింత మార్పు అవసరం
- సంబంధిత చట్టాలు, హక్కులపై విస్తృత ప్రచారం ముఖ్యం
- చిన్నారులపై అఘాయిత్యాలు కలచి వేస్తున్నాయి
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్
- ముగిసిన దివ్యాంగ బాలల హక్కుల పరిరక్షణ కార్యక్రమం

గుంటూరువెస్ట్: బాలలపై దాడులను కఠినంగా అణచివేయాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. చిన్నారుల రక్షణ కోసం రూపొందిన ఎన్నో చట్టాలపై విస్తృత ప్రచారం అవసరమని తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో హైకోర్టు (జువెనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల హక్కుల పరిరక్షణపై స్టేక్ హోల్డర్స్‌తో నిర్వహించిన వార్షిక రాష్ట్రస్థాయి సమావేశం విజయవంతంగా ముగిసింది. సాక్షాత్తూ రాష్ట్ర హైకోర్టు మొత్తం సమావేశ మందిరంలోనే ఉండడంతోపాటు ఆప్యాయంగా దివ్యాంగులు, చిన్నారులతో అందరూ ముచ్చటించారు. బాలలు పాడిన గీతాలను శ్రద్ధగా విన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జువెనైల్ జస్టిస్ కమిటీ చైర్ పర్సన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, హైకోర్టు న్యాయమూర్తులు చిన్నారులను పలకరిస్తూ, షేక్‌హ్యాండ్స్ ఇస్తూ ఉత్సాహపరిచారు. బహుమతులు కూడా అందించారు. విభిన్న ప్రతిభావంతులపై జరుగుతున్న దాడుల విషయంలో వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రచారం ముమ్మరం చేయాలి

జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. చిన్నారుల కోసం జువెనైల్ జస్టిస్ చట్టాలు, పోక్సో, లీగల్ ప్రొవిజన్స్ అంశాలపై పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ స్థాయిలలో ప్రచారం నిర్వహించాలన్నారు. క్రమం తప్పకుండా డిబేట్స్‌తోపాటు వార్తాపత్రికలు, ఇతర సాధనాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. మారుతున్న ఆధునిక సమాజంలో చిన్నారులపై జరిగే దాడులను కఠినంగా అణచివేయాలని వ్యాఖ్యానించారు. జాతీయ క్రైం బ్యూ రో 2023 గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 1,62,000 మంది బాలలపై నేరాలు జరిగాయన్నారు.

శాఖల మధ్య సమన్వయం అవసరం

జువెనైల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ మాట్లాడుతూ.. బాలల రక్షణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. చిన్నారుల చట్టాల అమలుకు సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. సమష్టి కృషితో కేసులను త్వరగా పరిష్కరించడంతోపాటు నేరాలు అరికట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో మార్పులకు అందరూ కృషి చేయాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు ఇప్పటికే ఈ దిశగా పని చేస్తున్నాయని అభినందించారు. ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులైన బాలల హక్కుల పరిరక్షణతోపాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను విశదీకరించారు. జువెనైల్ జస్టిస్ కమిటీ సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వి.సుజాత, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్య కుమారి, డైరెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, గుంటూరు లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి టి.లీలావతి, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెనాలి త్యాగం.. రగిలిన రణం!

- క్విట్ ఇండియా పోరులో ప్రాణాలొదిలిన ఏడుగురు ప్రముఖులు
- చర్చిల్‌నే ప్రపంచ పటంలో చిరునామా వెతికేలా చేసిన ఉద్యమం
- రేపు పట్టణంలో వీర సంస్మరణ దినం నిర్వహణకు ఏర్పాట్లు

స్వతంత్ర పోరులో 'తెనాలి' తెగువ ఆనాటి ప్రజల్లో స్వేచ్ఛా కాంక్షను మరింత రగిల్చింది. ఉద్యమ స్ఫూర్తిని చాటేలా చేసింది. ఆంగ్లేయులకు దడ పుట్టించిన పోరుగడ్డగా తెనాలి అవతరించింది. ఏడుగురి ప్రాణ త్యాగంతో తెగించి సమరభేరి మోగించేలా ప్రజల్లో చైతన్యం నింపింది. బానిస సంకెళ్లను తెంచాలనే కాంక్షను మరింత పెంచింది. క్విట్ ఇండియా స్ఫూర్తితో తెనాలిలో పడిన పోరు అడుగు... బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించింది. బ్రిటిష్ పార్లమెంటును సైతం తాకిన ఇక్కడి పోరాటం 'తెనాలి ఎక్కడ?..' అని ఏకంగా చర్చిల్ ఆరా తీసేలా చేసింది.



రణరంగ చౌక్‌లోని అమరవీరుల స్తూపాలు

తెనాలి: భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో తెనాలి కీలకపాత్ర పోషించింది. 'డూ ఆర్ డై' పేరుతో సాగిన క్విట్ ఇండియా ఉద్యమంలో ఇక్కడ జరిగిన పోరాటం బ్రిటిష్ పార్లమెంటును సైతం భయపెట్టింది. ప్రపంచ పటంలో తెనాలి ఎక్కడ..? అంటూ చర్చిల్ సైతం ఆరా తీశారు. పట్టణవాసులపై సామూహిక జరిమానా విధించి, నానా అగచాట్లకు గురిచేశారు. 1942 ఆగస్టు 8న ముంబయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో గాంధీజీ చేసిన ప్రసంగం 'క్విట్ ఇండియా' తీర్మానానికి దారితీసింది. ఆ వెంటనే దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌వాదులను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ముంబయి సమావేశంలో పాల్గొన్న కల్లూరి చంద్రమౌళి, వెలువోలు సీతారామయ్య, పుతుంబాక శ్రీరాములు, అవుతు సుబ్బారెడ్డి, శరణు రామస్వామి తెనాలి తిరిగొచ్చారు. 11వ తేదీన నాటి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (వెర్రైయ్య గారి మేడ)లో కార్యకర్తలకు ఏఐసీసీ కార్యాచరణను వివరించారు. మరుసటిరోజున పట్టణ బంద్‌కు నిర్ణయించారు. తాలూకా హైస్కూలు, భారత్ ట్యుటోరియల్ కాలేజీ విద్యార్థులు, కొత్తమాసు మోహనరావు, కోగంటి వెంకట్రామయ్య, దాచేపల్లి సుబ్బారావు, కొల్లి ప్రసాద్ ప్రోత్సాహంతో పాఠశాలలను బహిష్కరించి, సంపూర్ణ బంద్ నిర్వహించాలని తలపెట్టారు.

రైల్వేస్టేషన్‌పై ప్రజల ఆగ్రహజ్వాల

ఆగస్టు 12న ఉదయం కాంగ్రెస్ వలంటీర్లు, విద్యార్థులు జట్లుగా బయలుదేరి బంద్ తీరును పర్యవేక్షించసాగారు. రైల్వేస్టేషను ఫలహారశాల నడుస్తున్న విషయం తెలిసి, అక్కడకు చేరుకున్నారు. మూసివేయటం కుదరదని మేనేజరు చెప్పటంతో దాడి చేశారు. స్పెన్సరు క్యాంటీనులో మద్యం సీసాలను పగులగొట్టారు. గుంటూరు రైలు బయలుదేరటంతో సిగ్నల్‌పోస్టును ధ్వంసం చేశారు. డ్రైవరుపై రాళ్ల వర్షం కురిపించారు. ఉత్తరం వైపు క్యాబిన్ దగ్గర్లోని ఆయిల్ ట్యాంకుకు నిప్పుపెట్టారు. చెన్నై ప్యాసింజరు రైలు నాలుగు బోగీలను తగులబెట్టారు. స్టేషన్‌ను దహనం చేశారు. ఈ సంఘటనలు విద్యార్థి ఉద్యమాల నుంచి రూపుదిద్దుకున్నాయి. విద్యార్థుల కోసం తాలూకా హైస్కూలుకు వెళ్లిన పోలీసులను ప్రధానోపాధ్యాయుడు జొన్నగలగడ్డ శివసుందరం గేటులోనే అడ్డుకున్నారు. తనను కాల్చిన తర్వాతే లోనికి అడుగుపెట్టాలని స్పష్టంగా చెప్పటంతో వెనుదిరిగారు. ఈ ఘటనలపై ఎందరినో చిత్రహింసలు పెట్టారు. అరెస్టు చేసి కోర్టులో శిక్షలు వేశారు. తెనాలి ప్రజలపై రూ.2 లక్షల జరిమానా విధించారు. ఆ మొత్తం వసూలుకు ప్రజలను పెట్టిన బాధలు అన్నీఇన్నీ కావు.

తుపాకీ తూటాలను సైతం లెక్కచేయక...



నీలం సంజీవరెడ్డి, కామరాజ్ నాడార్‌లను సూర్యరథంపై తీసుకొస్తున్న వెంకట్రామయ్య

కొత్తపేటలోని సబ్‌ట్రెజరీ వైపు బయలుదేరిన ప్రదర్శకులు స్టేషను రోడ్డులోంచి మలుపు తిరుగుతుండగా పోలీసులు వచ్చారు. పోలీసు గూఢచారులుగా వ్యవహరిస్తున్న అప్పట్లోని పట్టణ న్యాయవాదులు ఇరువురిని తీసుకొని డీఎస్పీ స్వయంగా అక్కడకు చేరుకున్నారు. 'చెదిరిపోకపోతే పోలీసులు కాల్పులు జరుపుతారు.. పారిపోయి ప్రాణాలు దక్కించుకోండి' అంటూ వారితో చెప్పించారు. దీంతో ఆగ్రహించి మరింత రెచ్చిపోయిన జనం, వారినే వెళ్లిపొమ్మని హెచ్చరించారు. ఇదిలా సాగుతూ ఉండగానే జిల్లా కలెక్టర్, ఎస్పీలు రిజర్వు బలగాలతో అక్కడకు చేరుకున్నారు. పోలీసు హెచ్చరికలను లెక్కచేయని ప్రదర్శనకారులపై పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టారు. తూటాలకు భాస్కరుని లక్ష్మీనారాయణ, మాజేటి సుబ్బారావు, శ్రీపతి పండితారాధ్యుల శ్రీగిరిలింగం, ప్రయాగ వీరరాఘవయ్య అక్కడికక్కడే మరణించారు. గాయాలపాలై ఆస్పత్రిలో చేర్చిన వారిలో జాస్తి అప్పయ్య, తమ్మినేని సుబ్బారెడ్డి, గాలి రామకోటయ్య మరణించారు. కాల్పులు విరమించాకే అందరూ తిరిగి ఇళ్లకు వెళ్లారు. ఇది జరిగిన కొద్ది గంటల్లోనే దుగ్గిరాల రైల్వేస్టేషనును తగులబెట్టారు.

స్మృతిచిహ్నంగా ఏడు స్తూపాలు



స్తూపాల వద్ద సీఎం నీలం సంజీవరెడ్డితో కాంగ్రెస్ ప్రముఖులు కన్నెగంటి రెడ్డమ్మ

పోరాటం సాగిన స్థలానికి రణరంగ్ చౌక్‌గా నామకరణం చేశారు. 1959లో మున్సిపల్ చైర్మన్ ఆలపాటి వెంకట్రామయ్య అమరవీరుల స్మృతి చిహ్నంగా ఏడు స్తూపాలను నిర్మించారు. అదే ఏడాది డిసెంబరు 20న అప్పటి మద్రాస్, ఏపీ ముఖ్యమంత్రులు కామరాజ్ నాడార్, నీలం సంజీవరెడ్డిని ఆహ్వానించారు. వారిని ఏడు గుర్రాలు పూన్చిన 'సూర్యరథం'పై ఊరేగింపుగా తోడ్కొని వచ్చి స్తూపాలను ఆవిష్కరింపజేశారు. తూటాలకు కుప్పకూలిన అమరవీరుడిని భరతమాత చేతుల్లోకి తీసుకున్నట్టుగా తెనాలి శిల్పి చిన్నాల రంగారావు రూపొందించిన విగ్రహాన్ని స్తూపాల ఎదుట ప్రతిష్ఠించారు. 2015 నుంచి పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 12న వీరసంస్మరణ దినం నిర్వహిస్తున్నారు. క్విట్ ఇండియా పోరులో అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటున్నారు.

క్లుప్తంగా

డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన కారు

కొల్లూరు: అతివేగంగా కారణంగా కారు నియంత్రణ కోల్పోయి సైడ్ డ్రైన్‌లోకి దూసుకెళ్లిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. భట్టిప్రోలు మండలం వెల్లటూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి తెనాలి వైపు నుంచి కారులో వస్తుండగా, రేపల్లె - తెనాలి ప్రధాన రోడ్డులోని మలుపులో కారును అదుపుచేయడంలో విఫలమయ్యాడు. కారు నూతనంగా నిర్మాణంలో ఉన్న రామమందిరాన్ని తాకుతూ సైడ్‌డ్రైన్‌లో దిగబడిపోవడంతో స్థానికులు స్పందించి కారులోని వ్యక్తిని బయటకు తీశారు. అనంతరం కారును వెలుపలకు తీసేందుకు విఫలయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో తెల్లవారుజాము సమయంలో ప్రొక్లెయిన్ సాయంతో కారును బయటకు తీశారు. నిరంతరం రద్దీగా ఉండే రహదారిలో కారు సైడ్ డ్రైన్‌లోకి దూసుకెళ్లడంతో కొద్ది సమయంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠినచర్యలు

బాపట్లటౌన్: లాడ్జీలు, హోటళ్లల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తుషార్‌డూడీ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని పోలీస్ అధికారులు లాడ్జీలు, హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హోటళ్ల, లాడ్జీలు, రిసార్ట్స్‌ల్లో ఉండడానికి వచ్చేవారి గుర్తింపు కార్డులను తనిఖీ చేసి, వివరాలు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు, యజమానులకు సూచించడం జరిగిందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చోటు చేసుకుంటే వాటి యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. హోటళ్ల, లాడ్జీలలో పాత నేరస్తులు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడే అవకాశం ఉన్నవారు, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డయల్ 100, 112 లకు కాల్ చేసి సమాచారం అందజేయాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పిడుగుపాటుకు 8 పొట్టేళ్లు మృతి

అద్దంకి రూరల్: పిడుగుపాటుతో ఎనిమిది పొట్టేళ్లు మృతిచెందిన ఘటన శనివారం సాయంత్రం మండలంలోని మణికేశ్వరం గ్రామ పొలాల్లో జరిగింది. బాధితుడైన పొట్టేళ్ల యజమాని తెలిపిన వివరాల మేరకు.. కొరిశపాడు మండలం అనమనమూరు గ్రామానికి చెందిన సుబ్బారావు తన పొట్టేళ్లను మణికేశ్వరం పరిధిలోని పొలాల్లో మేతకు తీసుకెళ్లాడు. ఒక్కసారిగా పిడుగు పడటంతో ఎనిమిది పొట్టేళ్లు అక్కడికక్కడే మృతువాత పడ్డాయి. వీటి విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వ పరంగా తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

శుభకార్యం కోసం వచ్చి తీవ్ర గాయాలపాలు

కారును ఢీకొన్న లారీ



తీవ్రగాయాలపాలైన అజయ్



చిలుమూరు కరకట్టపై లారీ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు

కొల్లూరు: శుభ కార్యం కోసం విదేశాల నుంచి వచ్చిన యువకుడు ప్రమాదానికి గురై ఆసుపత్రి పాలైన సంఘటన మండలంలోని చిలుమూరులో ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. భట్టిప్రోలు మండలం ఐలవరంకు చెందిన కొతారపు అజయ్ జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లి కుటుంబానికి ఆదరవుగా ఉంటున్నాడు. సోమవారం అజయ్ వివాహ నిశ్చితార్థం ఉండటంతో దుబాయ్ నుంచి గన్నవరం విమానాశ్రయం వచ్చిన అన్నను తీసుకొని ఇతర బంధువులను కారులో ఎక్కించుకొని అజయ్ సోదరుడు సోదరుడు సాయిసురేంద్ర స్వగ్రామం వెళుతున్నాడు. ఈక్రమంలో మండలంలోని చిలుమూరు కరకట్ట రహదారిలో కొల్లూరు నుంచి వెళుతున్న లారీడ్రైవర్ లారీని ఎదురుగా ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను తప్పించి ముందుకెళ్లేందుకు కుడిచేతి వైపునకు పోనివ్వడంతో ఎదురుగా వస్తున్న కారు నడుపుతున్న అజయ్ సోదరుడు సాయిసురేంద్ర లారీ తమవైపు వస్తుండటం గమనించి కారును పక్కకు పోనిచ్చేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో లారీ డ్రైవర్ సైతం లారీని తిరిగి ఎడమవైపునకు పోనివ్వడంతో కారును ఢీకొట్టాడు. ప్రమాదంలో అజయ్‌కు తీవ్ర గాయాలు కావడంతో తొలుత కొల్లూరు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. అజయ్ సోదరుడు సాయిసురేంద్రతోపాటు, మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి.

జిల్లాలో 18 మంది ఎస్‌ఐలు బదిలీ

మరో ఐదుగురు వీఆర్‌కు

బాపట్లటౌన్: జిల్లాలో 18 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ తుషార్‌డూడీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న 13 మంది ఎస్‌ఐలకు పోస్టింగ్ ఇవ్వడంతోపాటు మరో ఐదుగురు ఎస్‌ఐలను వీఆర్‌కు పిలిచారు.

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం	బదిలీ చేసిన ప్రదేశం
ఎం. మోహన్	జిల్లా వీఆర్	రేపల్లె పోలీస్‌స్టేషన్
బండ్ల భార్గవ్	వీఆర్	నగరం
ఎండీ ఫిరోజ్ ఫాతిమా	వీఆర్	చోడాయపాలెం
జి. ఏడుకొండలు	వీఆర్	కొల్లూరు
జి. రవికృష్ణ	వీఆర్	వేమూరు
జానకి అమర్‌వర్ధన్	వీఆర్	అమర్తలూరు
ఎం. విజయ్‌కుమార్	వీఆర్	బాపట్లటౌన్
సిహెచ్. చంద్రవతి	వీఆర్	బాపట్లటౌన్
ఆర్. స్వామిశ్రీనివాస్	వీఆర్	చందోలు
బి. వినోద్‌బాబు	వీఆర్	జె.పంగులూరు
వి. వెంకట్రావు	వీఆర్	కారంచేడు
జి. రాజ్యలక్ష్మి	చోడాయపాలెం	అడవులదీవి
పి. కోటేశ్వరరావు	నగరం	రేపల్లె
సిహెచ్. ప్రవీణ	వీఆర్	అద్దంకి టౌన్
బి. అజిత	వెదుళ్ళపలి	చీరాల 1 టౌన్
షేక్. అబ్దుల్ రజాక్	బాపట్లటౌన్	చీరాల 1 టౌన్
ఎం. శ్రీనివాసరావు	వీఆర్	చీరాల 2 టౌన్
వి. నాగశ్రీను	వీఆర్	చీరాల 2 టౌన్

వీఆర్‌కు బదిలీ అయిన ఎస్‌ఐలు..

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం పనిచేసే స్టేషన్
ఎస్. రాజశేఖర్	వేమూరు
కె. సురేష్	కారంచేడు
జి. నవీన్‌కుమార్	అమర్తలూరు
వి. వేమన	చీరాల 1 టౌన్
ఎస్.వి. రవీంద్రారెడ్డి	కొల్లూరు

రణక్షేత్రంలో పల్నాటి వీరాచారుల కొలుపులు

- కారెంపూడికి తరలివచ్చిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు గ్రామాల వీరాచారవంతులు
- చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మకు ప్రత్యేక పూజలు



చెన్నకేశవస్వామి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వీరాచారవంతులు

కారెంపూడి: రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన పల్నాటి వీరాచారవంతులు తమ పల్నాటి వీరుల కొణతాలకు శనివారం పల్నాటి రణక్షేత్రమైన కారెంపూడిలో కొలుపులు నిర్వహించారు. గత మూడు రోజులుగా వివిధ రకాల క్రతువులను పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయుధాలకు చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ, ఉగ్రనరసింహస్వామి యంత్ర పూజలు చేయించారు. జలాధివాసం, ధాన్యధివాసం, శయ్యాధివాసం కార్యక్రమాల అనంతరం శనివారం అంకాలమ్మ, చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొలుపులు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం దగ్గర మాకుమామిడి గ్రామం నుంచి 35 కుటుంబాలు, సత్తెనపల్లి దగ్గర కొండూరు నుంచి 45 మంది, వినుకొండ దగ్గర నాగులవరం నుంచి, ప్రకాశం జిల్లా నిడమానూరు ప్రాంతాల నుంచి పల్నాటి వీరాచారవంతులు కారెంపూడి తరలివచ్చి తమ ఇలవేల్పులుగా కొలుచుకునే పల్నాటి వీరుల ఆయుధాలకు యంత్ర ప్రతిష్ట చేయించుకున్నారు. అనివార్య కారణాల వల్ల వీరంతా పల్నాటి వీరుల ఉత్సవాలలో పాల్గొని తమ పూర్వికులను స్మరించుకునే కార్యక్రమాలను గత కొన్నేళ్లుగా నిర్వహించలేక తమకు దగ్గరలోని చెన్నకేశవస్వామి, వీర్లంకమ్మ తల్లి దేవాయాలల్లో ఇంతకాలం క్రతువులు నిర్వహించుకున్నారు. అయితే కారెంపూడి వెళ్లి అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామిని దర్శించుకుని తప్పక పూజలు చేయాలని ప్రభలమైన కోరికతో ఇక్కడకు వచ్చి పల్నాటి వీరాచార కార్యక్రమాలను నిర్వహించారు. తామంతా వ్యయప్రయాసలకోర్చి పల్నాటి రణక్షేత్రంలో కొలుపులు చేయడం జరిగిందని ఆచారవంతులు పేర్కొన్నారు.

15 నుంచి బీజేపీ వినతుల స్వీకరణ

గుంటూరు మెడికల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 15వ తేదీ నుంచి వినతులు స్వీకరించేందుకు బీజేపీ నిర్ణయించింది. పార్టీ ప్రజా ప్రతినిధులు విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఈ మేరకు వారధి కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ చెప్పారు. ఇలాంటి కార్యక్రమాల ఏర్పాటు శుభ పరిణామమని తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

జే.పంగులూరు: రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొట్టడంతో ఓవ్యక్తి మృతి చెందిన ఘటన. మండల పరిధిలోని బైటమంజులూరు జాతీయ రహదారిపై శనివారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. బైటమంజులూరు గ్రామానికి చెందిన మృతుడు సరికొండ నాగరాజు (39) బేల్దారి పనులకు వెళ్తుంటాడు. శనివారం పనులు ముగించుకొని చిలకలూరిపేట నుంచి బస్సులో వచ్చి జాతీయ రహదారిపై దిగాడు. గ్రామంలోకి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా, ఆ సమయంలో విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఇంద్ర బస్సు ఢీకొంది. ప్రమాదంలో మృతుడికి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శివపార్వతి ఉంది.

ఆఫ్రికన్ వైద్యనిపుణులకు మోకీలు మార్పిడిపై శిక్షణ



అంగోల వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి



ఆపరేషన్ చేయించుకున్న రోగి, వారి బంధువులతో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అరుదైన ఘనతను సాధించారు. విదేశాల్లో మోకీలు మార్పిడి ఆపరేషన్లు స్వయంగా చేసి విదేశీయులకు గుంటూరులో ఈ తరహా సర్జరీలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్‌లకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన శనివారం మీడియాకు వెల్లడించారు. ఆఫ్రికన్ దేశాలలో అత్యంత వెనుకబడిన అంగోలాలో వారం రోజులు పర్యటించినట్లు చెప్పారు. అంగోల దేశ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సిల్వియా పౌల లుటుకుట ఆహ్వానం మేరకు ఆ దేశంలోనే తొలిసారిగా రివిజన్ నీ రీప్లేస్మెంట్ సర్జరీ నిర్వహించామన్నారు. నాలుగు రోజులపాటు అక్కడి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. వారి సూచన మేరకు యువ వైద్యులకు గుంటూరులోని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్‌లపై శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. ఈ మేరకు ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో రివిజన్ నీ రీప్లేస్మెంట్ సర్జరీలకు రాజధాని అమరావతి కేంద్ర బిందువుగా మారనుందని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి వెల్లడించారు.

అరిగేలా.. ఆరగిద్దాం..!

- వేళాపాళా లేకుండా తినడంతో సమస్యలు
- గ్యాస్ట్రో పెరేసిస్ బారిన పడుతున్న యువత
- ఈ వ్యాధిపై అవగాహన మాసంగా ఆగస్టు
- ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పుతో ఊరట



గుంటూరు మెడికల్ : ఆధునిక జీవన శైలి వల్ల సరైన సమయానికి భోజనం చేయకపోవడం వల్ల అనేక అనర్థాలు తలెత్తుతున్నాయి. ఒత్తిడితో కూడిన జీవన శైలితో ఎక్కువ మంది మధుమేహం బారిన పడుతున్నారు. వ్యాధి నియంత్రణలో లేకపోవడంతో జీర్ణకోశ సంబంధిత సమస్యలు సైతం ఉత్పన్నం అవుతున్నాయి. వేళాపాళా లేకుండా తినడం కారణంగా అరగక గ్యాస్ట్రో పెరేసిస్ అనే వ్యాధి ఉత్పన్నం అవుతోంది.

జీర్ణాశయానికి వాతం సోకడాన్నే గ్యాస్ట్రో పెరేసిస్ అంటారు. ముఖ్యంగా యువత ఈ వ్యాధి బారిన పడడం ఆందోళనకర అంశమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు పేర్కొంటున్నా రు. ఆగస్టు నెలను ఈ వ్యాధిపై అవగాహన కల్పించే మాసంగా పాటిస్తుండటంతో ప్రత్యేక కథనం.

వ్యాధి లక్షణాలు

జీవనశైలిలో మార్పులు, వయస్సు పెరిగే కొద్ది గ్యాస్ట్రో పెరేసిస్ సమస్యలు వస్తున్నాయి. ఇది వచ్చిన వారికి ఆహారం తిన్న తర్వాత కడుపు ఖాళీ అవడానికి చాలా సమయం పడుతుంది. తద్వారా వికారం, వాంతులు, గుండెల్లో మంట, ఉబ్బరం, కడుపు నొప్పి, కొంచెం తిన్నా కడుపు నిండుగా అనిపించడం, ఆకలి లేకపోవడం, రక్తంలో చక్కెర స్థాయిలో మార్పులు తదితర లక్షణాలు కనిపిస్తాయి. తగినంత ఆహారం తినకపోవడం వల్ల బరువు తగ్గుతారు. శరీరానికి ముఖ్యమైన పోషకాలను సైతం కోల్పోతారు.

కారణాలు

వ్యాధి రావడానికి పూర్తి కారణాలు నిర్ధారించలేదు. కొన్ని సందర్భాల్లో కడుపు కండరాలను (వాగస్ నరాలు) నియంత్రించే నరాలు దెబ్బతినడం వల్ల ఇది సోకుతుంది. వాగస్ నాడి జీర్ణ వ్యవస్థలోని సంక్లిష్టమైన కార్యకలాపాలను నియంత్రిస్తుంది. కడుపు కండరాలను సంకోచింపజేయడం, చిన్నపేగులోకి ఆహారాన్ని నెట్టడం వంటివి చేస్తుంది.

ఫైబర్ తక్కువగా తీసుకోవాలి

బాధితులకు ఫైబర్, ఫ్యాట్ తక్కువగా ఉన్న ఆహా రం ఇవ్వాలి. తద్వారా మంచి ఫలితాలు వస్తాయి. తక్కువ మొత్తంలో వీలైతే రోజుకు 4 నుంచి 5 సార్లు ఆహారం తీసుకోవాలి. భోజన సమయంలో జీర్ణక్రియకు సహాయ పడేలా ద్రవపదార్థాలు తాగాలి. బ్రకోలి, క్యాబేజీ, బీన్స్, బెల్‌పెపర్స్ వంటి కూరగాయలకు దూరంగా ఉండాలి. జున్ను, క్రీమ్, వెన్న, కొవ్వు అదనంగా ఉండేవీ తినకూడదు. ఆహా రంలో తగ్గిన పోషకాలను భర్తీ చేసుకోవడానికి రోజూ మల్టీ విటమిన్స్ టాబ్లెట్స్ తీసుకోవాలి. భోజనం చేసిన తర్వాత సుమారు రెండు గంటలపాటు ఆగిన తర్వాతే నిద్రించాలి. ఈలోగా కొంచెం దూ రం నడవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. ధూమ పానం, మద్యపానం పూర్తిగా మానాలి. కార్బొనేటెడ్ డ్రింక్స్ తాగకూడదు. ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఉపయోగం ఉంటుంది.

జీవన శైలి మార్పుతో నివారించవచ్చు



జీవన శైలిలో మార్పు ద్వారా గ్యాస్ట్రో పెరేసిస్‌ను నివారించవచ్చు. మధుమేహ బాధితులు షుగర్‌ను నియంత్రణలో పెట్టుకోవాలి. ధూమపానం, మద్యపానం మానివేయాలి. ఆహారాన్ని పూర్తిగా నమిలి మింగాలి. జీర్ణక్రియను నెమ్మది చేసే జిడ్డుతో కూడిన ఆహారాన్ని తీసుకోవద్దు. రోజూ నీరు ఎక్కువగా తాగాలి.

– డాక్టర్ ఆళ్ల సిద్దార్థరెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



గుంటూరు జీజీహెచ్‌లో గ్యాస్ట్రో పెరేసిస్ బాధితులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. రోజూ వివిధ రకాల జీర్ణ సంబంధిత సమస్యలతో 100- 125 మంది గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి చికిత్స కోసం వస్తున్నారు. గ్యాస్ట్రో పెరేసిస్ బాధితులు ప్రతినెలా 20 మంది ఉంటున్నారు. ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా మందులతో వ్యాధిని కట్టడి చేయవచ్చు.

– డాక్టర్ అనుమల కవిత